
మినీ కథ

# జరుగుతున్నకథ

- పి.దామోదరస్వామి



రాజధాని నగరంలో ఒక కాలనీ అది! కాలనీ పేరు ఏదైతేనేమి? ప్రభుత్వ ఉద్యోగులు అధికంగా నివసించే కాలనీ! ఆ కాలనీ నుంచి సెలవు దినాలలో మినహా ప్రతిరోజూ బస్సులు ఉద్యోగు లను సచివాలయానికి చేరవేస్తుంటాయి.

మన కథకు రంగస్థలంగా ఏ కాలనీనైనా తీసుకోవచ్చును.

ఒకరోజు ఉదయం 8-30 గంటల సమయం ఒక ఉద్యోగి వచ్చి ఒకచోట ఒకరాయి పెట్టి వెళ్ళాడు. ఆ తరువాత మరొకరు వచ్చి దాని వెనుక మరో రాయి పెట్టారు. కొంచెం సేపట్లో రాళ్ళ క్యూ పెరిగిపోయింది. అప్పటికి 15 నిమిషాలు గడిచాయి. 12 ఏళ్ళబాలుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. చివరి రాయి తరువాత నిలబడిపోయాడు. ఈలోగా మరో పెద్దమనిషి వచ్చిచేరాడు. వెడల్పాటి ప్లాస్టిక్ కాగితాన్ని సంచీలోంచి తీసి క్రిందపరిచి, దానిపై బాసింపట్టువేసి కూర్చున్నాడు.

అప్పటికి సమయం 9-30 గంటలు అయ్యింది. మరో ఉద్యోగి వచ్చాడు ముందర వున్న రాయి చేతిలోకి తీసుకొని, దూరంగ గిరాటువేసి దానిస్థానంలో నిల్చున్నాడు.. ఆవిధంగా క్రమం గా రాళ్ళన్నీ మాయ మయ్యాయి. వాటి స్థానంలో ఉద్యోగులు నిలుచున్నారు. వారితో క్యూ పొడవు పెరుగుతూనే వుంది.

అదిగో అటు చూడండి! ఒక వ్యక్తి సైకిల్ తొక్కుకుంటూ తాపీగా వస్తున్నాడు.అమ్మయ్య క్యూదగ్గరికి వచ్చాడు. 12 ఏళ్ళ బాలుని వద్దకు వచ్చి'' సైకిల్ తీసుకొని ఇంటికిపో! అన్నంతిని బడికి వెళ్ళు'' అని గదమాయించి పంపించి వేశాడు! ఆ బాలుని స్థానంలో ఆయన నిల్చు న్నాడు. ఆ బాలుడు కొడుకు - ఆయన తండ్రి. తండ్రికి సీటు రిజర్వు చేయటానికి కొడుకు యిచ్చిన సహకారమది!

అమ్మయ్య, బస్సులో నాకు సీటు వస్తుంది! అని ఒకరు సంతృప్తి వ్యక్తం చేశాడు!

ఎంత త్వరగా వద్దామన్నా భోజనం ఆలస్య మయిందండీ! అని ఒకరి సణుగుడు. యివ్వాళ్ళ బస్సులో సీటు దొరకదు, నిలుచునే ప్రయాణం చేయాలి అన్న అసంతృప్తి మరొకరిలో...

సరిగ్గా ఉదయం 9.45 నిమిషాలయ్యింది. బస్సు వచ్చి, క్యూలో మొదట నిలుచున్నవారి ముందు ప్రవేశద్వారం వచ్చేవిధంగా ఆగింది.

''ఎక్కండీ!'' అంటూ వెనుకనుంచి ముందు వారికి హెచ్చరింపు!

ఒక్కొక్కరే బస్సు ఎక్కుతున్నారు. క్యూ ముందుకు సాగుతున్నది. ఒకరు బస్సు ఎక్కారు. వెనుకవైపు సీటు లభించింది. నిన్నా, మొన్నా లభించిన ముందువైపు సీటు ఇవ్వాళ లభించలేదన్న అసంతృప్తిని పక్కాయనతో చెప్పుకుంటున్నాడు.

ఇక్కడొక విషయం చెప్పాలి. కొందరు ఉద్యోగులకు కొన్ని సెంటిమెంట్సు వున్నాయి. ఫలానా సీట్లో కూర్చొంటే ఆరోజు బాగా గడుస్తుందనీ! ప్రతిరోజూ అదే సీట్లో కూర్చో వాలన్న తాపత్రయం వారిది. అది నెలల తరబడి, సంవత్సరాల తరబడి సాగుతున్న తాపత్రయమది!

సీట్లు లభించిన వారు కూర్చున్నారు. లభించని వారు నిల్చొన్నారు. చేతిలోని సంచిని కూర్చున్న వారి ఒడిలో వేసి, రాడ్‌కు కట్టివున్న హేంగర్స్‌ను పట్టుకొన్నారు.

అన్నట్లు స్త్రీల క్యూ వేరే వుంటుంది. వారికి రిజర్వు చేసిన సీట్లు వుంటాయి. కాని వారు డ్రైవర్ వెనుక వైపునుంచి నిల్చుంటారు. ఈ కథలో స్త్రీలకు అంత ప్రాధాన్యతలేదు.

బస్సు నిండిపోయింది. కండక్టర్ బెల్ కొట్టాడు. బస్సు బయలుదేరింది.

కూర్చున్నవారిలో ఒక్కొక్కరి కన్నులు మూతలు పడటం ప్రారంభమైంది. క్రమేణా జోగటం కూడా మొదలైంది! అది వారికి చిన్న కూర్పాటు! అందుకే సీట్ల కొరకు అన్ని పాట్లు, ఇంట్లో హడావుడి చేయటం, త్వరగా భోజనం చేయటం, క్యూలో ముందుగా నిల్చుంటేగాని సీట్లు లభించని పరిస్థితి!

నిండు గర్భిణిలా బస్సు సాగుతున్నది. అన్ని స్టేజీలు, అన్ని మార్గాలు అధిగమించి, బస్సు సచివాలయం సమీపంలో వచ్చి సడన్ బ్రేక్‌తో ఆగింది. లోపల కూర్చున్న వారు ఉలిక్కిపడ్డారు! ఒకాయన ''ఏమండోయ్ సెక్రటేరియట్ వచ్చింది లేవండి'' అని యింకా జోగుతున్న వ్యక్తిని తట్టిలేపాడు. ఆయనా లేచాడు.

బస్సులోని వారందరూ క్రిందకిదిగి సచివాలయంవైపు భారంగా అడుగులు వేస్తున్నారు... ●